ప్రజాశక్తి

శనివారం 27 డిసెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

శ్రామిక ఉత్సవ్‌కు సర్వం సిద్ధం

- విశాఖ వేదికగా నేటి నుంచి కళా, సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనం
- సినీ నటుడు ప్రకాష్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరు



మీడియా సమావేశంలో శ్రామిక ఉత్సవ్ వివరాలను వెల్లడిస్తున్న సిహెచ్.నర్సింగరావు



ప్రకాష్ రాజ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సందర్భంగా శనివారం నుంచి విశాఖపట్నంలో 'శ్రామిక ఉత్సవ్' పేరిట భారీ కళా, సాంస్కృతిక, సాహిత్య విజ్ఞాన ప్రదర్శన జరుగనుంది. విశాఖ సాగర తీరం వద్దగల ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్ దీనికి వేదికగా నిలువనుంది. సమాజంలో సంపద సృష్టించే శ్రామిక వర్గం గొప్పతనాన్ని చాటిచెబుతూ, వారి హక్కుల పట్ల చైతన్యాన్ని కల్పించే లక్ష్యంతో ఈ ఉత్సవ్ రూపుదిద్దుకుంది. ఈ నెల 27 నుండి జనవరి 2 వరకు పలు కార్యక్రమాలు ఈ వేదికగా అందరినీ అలరించనున్నాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు బహుముఖ కార్యక్రమాలు ఉంటాయి. పుస్తక ప్రదర్శన చైతన్య కాంతులను విరజిల్లనుంది. సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకోనుంది. సామాజిక అంశాలను ప్రతిబింబించే ఫొటో ఎగ్జిబిషన్, కార్టూన్ ఎగ్జిబిషన్ తదితరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. 'శ్రామిక ఉత్సవ్'ను ఘనంగా నిర్వహించనున్నట్టు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తెలిపారు. శుక్రవారం ఉదయం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ప్రారంభించనుండగా, ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.



అప్పలరాజుపై నిర్బంధం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వి.శ్రీనివాసరావు, లోకనాథం, కోటేశ్వరరావు తదితరులు

ఊళ్లను ఏకం చేసి

న్యాయం కోసం పోరాడతాం

- కాలుష్య పరిశ్రమలపై పోరాడే అప్పలరాజుపై పీడీ చట్టం పెద్ద కుట్ర
- ఆయనకు అండగా ఉంటాం
- ధర్మవరం గ్రామాన్ని సందర్శించిన సిపిఎం బృందం ఎదుట ప్రజానీకం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో / ఎస్.రాయవరం విలేకరి

ప్రజా ఉద్యమ నేత, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజుపై పీడీ చట్టం బనాయింపు, అక్రమ అరెస్టుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. పార్టీలకు అతీతంగా ప్రజానీకం, నాయకుల నుంచి అప్పలరాజుకు నైతిక మద్దతు లభిస్తోంది. నక్కపల్లి మండలంలోని కాలుష్య పరిశ్రమల రాకతో ప్రజల ఆరోగ్యాలకు వచ్చే ముప్పు, ప్రభుత్వ అడ్డగోలు భూ సేకరణతో రైతులకు వాటిల్లే ఇక్కట్లపై నిరంతరం పోరాడిన అప్పలరాజును రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా నిర్బంధించిందని రాజయ్యపేట, ధర్మవరం వాసులు తెలిపారు. పీడీ చట్టం బనాయించి అరెస్ట్ చేసినా తమ గ్రామం అంతా ఆయనకు అండగా నిలుస్తామని అప్పలరాజు స్వగ్రామం ధర్మవరం వాసులు స్పష్టం చేశారు. నక్కపల్లి మండలంలోని 5 గ్రామాలూ ఆయన అరెస్టు చట్టవిరుద్ధమని మిగతా 2లో..

ఫైళ్లన్నీ ఇ-ఆఫీస్‌లోనే పంపాలి

వార్త 2లో..

కెజిహెచ్‌లో 'నకిలీ డాక్టర్' గుట్టురట్టు

వార్త 2లో..

ఉత్సాహంగా సిఐటియు మహాసభ ప్రచారం

వార్త 8లో..



పట్టుబడ్డ నిందితులతో పోలీసులు

72 కిలోల గంజాయి పట్టివేత

లేడీ డాన్‌తో సహా ఎనిమిది మంది స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి - గొలుగొండ : అల్లూరి ఏజెన్సీ నుంచి నర్సీపట్నాన్ని అడ్డాగా చేసుకొని ఇతర ప్రాంతాలకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఎనిమిది మంది ముఠాను నర్సీపట్నం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను నర్సీపట్నం డిఎస్‌పి శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ, నాతవరం ఎస్ఐ వై.తారకేశ్వరరావు నాతవరం మండలం శృంగవరం వద్ద వాహన తనిఖీలు చేయగా 72 కిలోల గంజాయి పట్టుబడింది. పోలీసులకు పట్టుబడిన వారంతా గంజాయి కేసుల్లో మిగతా 2లో..

గ్రామీణ ప్రాంతాల్లో..

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ పరిధిలోని మూడు జిల్లాలలో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశించారు. విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన 1 నుండి 7 స్థాయీ సంఘాల సమావేశాలు శుక్రవారం నిర్వహించారు. ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా గ్రామీణ మౌలిక వసతులపై దృష్టి సారిస్తూ, రహదారుల సంరక్షణ, తాగునీటి సమృద్ధి, సామాజిక భద్రతా పింఛన్ల సమర్థవంతమైన పంపిణీ వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పథకాలు, ముఖ్యంగా గ్రామీణ మౌలిక వసతులు, పింఛన్లు, విద్య, ఆరోగ్య రంగాలకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రతి శాఖ తమ చర్య ప్రణాళికను సిద్ధం చేసి, స్థాయి సంఘాలలో తీసుకున్న తీర్మానాల అమలు పురోగతిపై క్రమం తప్పకుండా నివేదికలు సమర్పించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలని సూచించారు. ఏజెన్సీలో ప్రభుత్వ వైద్యులు సమయపాలన పాటించటం లేదని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అక్కడ అందుబాటులో ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తపరిచారు. జిల్లా పరిషత్ సమావేశాలకు అల్లూరి జిల్లా వైద్య మిగతా 2లో..



మాట్లాడుతున్న సుభద్ర

మొదటి పేజీ తరువాయి..

ఊళ్లను ఏకం చేసి న్యాయం కోసం పోరాడతాం

ఖండిస్తున్నాయని అన్నారు. శుక్రవారం ఉదయం ధర్మవరం గ్రామాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు సహా పలువురు సందర్శించారు. అప్పలరాజు తల్లి అచ్చమ్మ, భార్య లక్ష్మి సహా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రాజయ్యపేట, ధర్మవరం గ్రామస్తులు మాట్లాడుతూ ఫార్మా, ఇతర కాలుష్య కంపెనీలు రాకముందు తామంతా బాగా బతికామని, చేపలు విరివిగా దొరికేవని, ఇప్పుడు ఆ పరిస్థితి భిన్నంగా మారిపోయిందని తెలిపారు. మా ప్రాంతంలో పరిశ్రమలు పెట్టి మమ్మల్ని బాధలకు గురిచేసే కంపెనీలతో మా హక్కుల రక్షణకు అప్పలరాజు నిలబడి పోరాడారని కొనియాడారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బ్యాంకుల వద్ద రుణాలు పొంది ఎగ్గొట్టిన నేతలపై చంద్రబాబు ప్రభుత్వం పీడీ చట్టం పెట్టలేదన్నారు. ఇసుక, మద్యం, డ్రగ్స్ మాఫియా చెలరేగిపోతున్నా పట్టించుకోలేదని తెలిపారు. అక్రమ మద్యం వ్యాపారులను దండించడానికి సైతం ఆ చట్టాన్ని వాడలేదన్నారు. అంటే చట్టాన్ని ధిక్కరించే వారి నుంచి చట్టాన్ని కాపాడకుండా, పెట్టుబడిదారులకు భూములు అక్రమంగా కట్టబెట్టే చర్యలపై పోరాడే అప్పలరాజుపై మాత్రం పీడీ చట్టం పెట్టారన్నారు. ఇంతకంటే అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధం ఇంకేముంది? అని అన్నారు. రాష్ట్రంలో 175 మంది ఎంఎల్ఎలు ఉన్నా అప్పలరాజు వ్యక్తిత్వానికి సరిపోరనగానే ప్రజల నుంచి చప్పట్లు మార్మోగాయి. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాతో కంటే ప్రజలతోనే ఎక్కువ ఉండేవారు: అప్పలరాజు భార్య లక్ష్మి

'ఆయన నాతో ఉండేకంటే నిరంతరం ప్రజలతోనే కలిసిమెలిసి ఉండేవారు. ప్రజల కష్టాలకు స్పందించేవారు. వాటిని నా దగ్గర చెప్పేవారు. ప్రజలు, రైతులు, పేదల బాధలు ఆలకిస్తూ వారికోసమే ఆలోచిస్తూ ఉద్యమాల్లోకి వెళ్లేవారు. అకస్మాత్తుగా గురువారం ఉదయం 150 మంది పోలీసులు గ్రామంలోకి వచ్చి అప్పలరాజును చుట్టుముట్టి అరెస్ట్ చేసి కాగితాలు మా చేతిలో పెట్టారు. అనితమ్మా.. మా బాధను ఒక ఆడదానిగా అర్థం చేసుకుని అప్పలరాజును తక్షణం విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వండి' అని అప్పలరాజు భార్య లక్ష్మి చెప్పుకొచ్చారు.

ప్రజానీకం ఏమన్నారంటే..

సిపిఎం నేత అప్పలరాజు ఈ ప్రాంత ప్రజల బాధలను తెలిసిన మంచి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి, ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు కాలుష్య పరిశ్రమలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ప్రభుత్వం 'కుట్ర'తో పీడీ చట్టాన్ని అతనిపై ప్రయోగించింది' అని రాజయ్యపేటకు చెందిన మహేష్ 'ప్రజాశక్తి' ఎదుట తెలిపారు. రాయవరానికి చెందిన రాజేష్ మాట్లాడుతూ హెటిరో వంటి కాలుష్య కంపెనీలతో 50 మందికి పైగా కేన్సర్‌కు గురయ్యారని, కిడ్నీలు అనేక మందికి పాడైపోయాయని, వీటికి వ్యతిరేకంగా పోరాడే అప్పలరాజును ఎన్నోసార్లు గ్రామంలోనే నిర్బంధించారని తెలిపారు. 'కల్తీ లేని రాజకీయ కార్యకర్త అప్పలరాజు' అని ధర్మవరం గ్రామానికి చెందిన బంగారయ్య అన్నారు. నక్కపల్లి వెళితే ఊపిరి కూడా తీసుకోలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. తెలుగుదేశం పార్టీ గ్రామ నాయకులు సుంకరి శ్రీను మాట్లాడుతూ అప్పలరాజు ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేసిన ఉద్యమకారుడని తెలిపారు. వైసిపి నాయకులు కర్రి శ్రీను మాట్లాడుతూ అప్పలరాజు ఇంత పెద్ద ప్రజా ఉద్యమకారుడైనా కడు పేదరికంలోనే జీవిస్తున్నాడన్నారు. ఆయన కోసం తమ గ్రామంలో ఎప్పుడూ పోలీసులు మాటు వేసే ఉంటారని, ఆయన ఉద్యమాలంటే ప్రభుత్వానికి భయమని అన్నారు. గ్రామ పెద్ద ఎస్.శ్రీను మాట్లాడుతూ అప్పలరాజు ఊరును, మమ్మల్ని వదిలి జైలుకెళ్లినా తమ కోసమే వెళ్లాడని, ఆయనకు తామంతా ఉన్నామని అన్నారు.

72 కిలోల గంజాయి పట్టివేత

నిందితులే. వారిలో ఒక లేడీ డాన్ కూడా ఉన్నారు. గాదె రేణుక అనే ఈ లేడీ డాన్ బెంగుళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగి. ఆమెది విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మోదుగులపేట గ్రామం. సాలూరు రూరల్, పాయకరావుపేట, నర్సీపట్నం టౌన్, బెంగుళూరులో కేసులు ఉన్నాయి. ఆమెను లేడీ డాన్‌గా పోలీసులు పేర్కొన్నారు. అల్లూరి జిల్లా బలిమెల ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ఒక కేజీ రూ.25 వేలు చొప్పున తమిళనాడుకు సరఫరా చేస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా ఆమె ఎక్కువగా ఉంటారు. ఏడాది కాలంగా నర్సీపట్నాన్ని షెల్టర్ జోన్‌గా వాడుకుంటూ శారదానగర్‌లో ఒక ఇంట్లో అద్దెకు ఉంటోంది. ఆమె అరెస్టుతో పలు విషయాలు వెలుగుచూశాయి. మరో నిందితుడు సూర్యకాళిదాసుపై కూడా పాత కేసులు ఉన్నాయి. తమిళనాడులోని తంజావూరు జిల్లా పట్టుకట్టాయి గ్రామానికి చెందిన అతనిపై చెన్నై పోలీస్ స్టేషన్‌ల్లో గంజాయి కేసు నమోదైంది. రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన అడ్డూరి ప్రసాద్‌పై కూడా నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు ఉన్నాయి. మదన్ కుమార్‌పై విశాఖ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మిగిలిన వారూ పలు కేసుల్లో నిందితులు. నిందితుల నుంచి రూ.18 లక్షలా 50 వేల విలువైన 74 కిలోల గంజాయి, కారు, ద్విచక్ర వాహనం, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రేపు ఎస్ఆర్ఎఎస్.అప్పలనాయుడు శతజయంతి వేడుకలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: మాజీమంత్రి, పార్లమెంట్ మాజీ సభ్యులు దివంగత ఎస్.ఆర్.ఎ.ఎస్ అప్పలనాయుడు శతజయంతి వేడుకలను ఈ నెల 28 న సింహాచలం-శొర్రాం రోడ్డు, ప్రత్యూష గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహిస్తున్నట్లుకేంద్ర గౌరీ సంఘం అధ్యక్షులు బుద్ధ శివాజీ తెలిపారు. శుక్రవారం కేంద్ర గౌరీ సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో దీనికి సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. 65 గౌరీసేవా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. జయంతి సందర్భంగా పలు సాంస్కృత కార్యక్రమాలు ఉంటాయన్నారు. కేంద్ర గౌరీ సంఘం ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి..)
ఆరోగ్యశాఖ అధికారిగానీ, సూపరింటెండెంట్ స్థాయి అధికారులుగానీ హాజరు కావడం లేదన్నారు. దిగువ స్థాయి సిబ్బందిని పంపడం మంచిది కాదన్నారు. ఇకమీదట అలా చేస్తే కుదరదని తెలిపారు. విశాఖపట్నం కెజిహెచ్‌లో బ్రోకర్లను నియంత్రించాలన్నారు. తమ కుటుంబాన్ని చెందిన వారిని కెజిహెచ్‌కు తీసుకువెళ్తే బ్రోకర్లు ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. తాము అప్రమత్తమయ్యాయని, అలానే అందరూ అటువంటివారిని నిరోధించాలని ఆదేశించారు. అనకాపల్లి జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేస్తున్న పక్కా గృహాల లబ్ధిదారుల ఎంపికలో తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉన్న వారి పేర్లు మాత్రమే నమోదు చేస్తున్నారని, వైసిపితో సహా ఇతర పార్టీలకు చెందిన వారి పేర్లను కావాలని నమోదు చేయటం లేదని అన్నారు. ఇది మంచిది కాదన్నారు. లబ్ధిదారులను అర్హత ప్రాతిపదికన ఎంపిక చేయాలని, రాజకీయాలు చూడకూడదని హౌసింగ్ కార్పొరేషన్ అధికారులకు స్పష్టం చేశారు. మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ మునగపాక మేజర్ పంచాయతీలో బిల్లు కలెక్టర్, అతని సహాయకుడు కలిపి రూ.13 లక్షలు మేర ఇంటి పన్నుల సొమ్ము స్వాహా చేశారని, వారిపై ఎటువంటి చర్య తీసుకున్నారని గత సమావేశంలో తాను కోరానని, దానికి సమాధానం కావాలని పట్టుబట్టారు. అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి సందీప్ మాట్లాడుతూ బిల్ కలెక్టర్ నుంచి రూ.7 లక్షలను ఆయన జీతం నుంచి రికవరీ చేసేందుకు నిర్ణయించామని, అతనిని సస్పెండ్ చేశామని చెప్పారు. అతనికి సహాయకునిగా ఉన్న ఉద్యోగి రూ.6 లక్షలు స్వాహా చేశాడని, ప్రస్తుతం కశింకోట పంచాయతీలో పనిచేస్తున్నాడని తెలిపారు. అతనికి సంబంధించిన ఫైల్ కనిపించలేదన్నారు. అయినప్పటికీ చర్య తీసుకుంటామని చెప్పారు. కెజిహెచ్ సహా గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల నాణ్యత, వైద్య సిబ్బంది లభ్యత, అవసరమైన ఔషధాలు, పరికరాల సరఫరా సమస్యలను కొందరు జెడ్‌పిటిసిలు ప్రస్తావించారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న పరవాడ జెడ్‌పిటిసి రాజు

పరవాడ జెడ్‌పిటిసి, స్టాండింగ్ కమిటీ సభ్యులు పిఎస్.రాజు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా నిధుల వినియోగం జరగాలని సూచనలు చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మధ్యాహ్నం 2 గంటలకు 1 నుండి 7 స్థాయి సంఘాల సమావేశాలలో 2025-2026 సంవత్సరానికి సవరణ బడ్జెట్, 2026-2027 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను సభలో చదివి వినిపించారు. సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ ఉప నిర్వహణ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో నకిలీ డాక్టర్ గుట్టురట్టు

కిడ్నీ చికిత్స పేరుతో లక్ష రూపాయలు టోకరా!

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: విశాఖపట్నం కెజిహెచ్ వేదికగా అమాయక ప్రజలను మోసం చేస్తున్న 'నకిలీ డాక్టర్' గుట్టును వన్‌టౌన్ పోలీసులు రట్టు చేశారు. తన కుమారుడి కిడ్నీ చికిత్స కోసం తపిస్తున్న ఒక తండ్రి నిస్సహాయతను ఆసరాగా చేసుకుని లక్ష రూపాయలను కాజేసిన నిందితుడిని అరెస్ట్ చేయటం జరిగిందని విశాఖపట్నం డిసిపి -1 (లాండ్‌ఆర్డర్) మణికంఠ చందోలు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన దూసి రామ్జీ కుమారుడు (5) గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. వైద్యులు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స అవసరమని సూచించారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రామ్జీ, సాయం కోరుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 22న పత్రికల్లో ప్రకటన ఇచ్చారు. దీనిని గమనించిన నిందితుడు ఇమ్మాండి జ్యోతి శివశ్రీ, 'డాక్టర్ నరసింహం' పేరుతో 2025 ఫిబ్రవరి 25న బాధితుడికి ఫోన్ చేశాడని తనకు ప్రభుత్వం నుండి సమాచారం అందిందని, వెంటనే కేజీహెచ్‌కు రావాలని నమ్మబలికాడు. రామ్జీ తన కుమారుడితో కలిసి కెజిహెచ్‌కు చేరుకోగా, నిందితుడు తెల్లకోటు ధరించి 'డాక్టర్ ప్రవీణ్' (పిజి డాక్టర్) పేరుతో వారిని కలిశాడని, వారిని సూపరింటెండెంట్ కార్యాలయం వద్దకు తీసుకెళ్లి నమ్మకం కలిగించి, ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలు సిద్ధం చేయాలని చెప్పటంతో బాధితుడు నమ్మి సాయంత్రానికి లక్ష రూపాయల నగదును నిందితుడికి అందజేశాడు. తర్వాత సదరు వ్యక్తి ఫోన్ స్విచ్ఆఫ్ రావడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. విశాఖ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి సిసిటివి ఫుటేజిలు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. నిందితుడు విజయవాడకు చెందిన ఇమ్మాండి జ్యోతి శివశ్రీగా గుర్తించి డిసెంబర్ 25 న అరెస్ట్ చేశామని తెలిపారు. అనంతరం అతని వద్ద నుండి రూ. 30,000 నగదు, ఆప్రాన్ (కోటు), స్టెతస్కోప్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడు శివశ్రీ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి, వత్తిరీత్యా కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

అయితే, 2004 నుంచి నేరప్రవృత్తికి అలవాటు పడ్డాడు. బైక్ దొంగతనాలు, సెల్‌ఫోన్ షాపుల్లో మోసాలు, కార్ల అమ్మకాల పేరుతో అడ్వాన్సులు వసూలు చేసి పరారవ్వడం ఇతని నైజం. ముఖ్యంగా పత్రికల్లో వచ్చే ప్రకటనల ద్వారా నిస్సహాయులను గుర్తించి, వారిని ప్రభుత్వ అధికారిగానో లేదా డాక్టర్‌గానో నమ్మించి మోసం చేయడంలో ఆరితేరినట్లు పోలీసులు ఇతడిపై ఆంధ్రప్రదేశ్ తెలంగాణా రాష్ట్రాల్లో 33 కేసులు ఉన్నాయని వెల్లడించారు.

ఫైళ్లన్నీ ఇ-ఆఫీస్‌లోనే పంపాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఇకపై ప్రతి ఫైలు తప్పనిసరిగా ఇ-ఫైల్ రూపంలోనే నిర్వహించాలని, తనకి సమర్పించే ఫైళ్లను కూడా ఇ-విధానంలోనే పంపించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఫిజికల్‌ఫైళ్ల నిర్వహణకు పూర్తిగా స్వస్తి పలికి, ఇ-ఆఫీస్ విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జనవరి 15 తర్వాత ప్రజలకు ప్రభుత్వం అందించే అన్ని సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అందించనున్నట్లు గుర్తు చేస్తూ స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ నెల 17, 18 తేదీల్లో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ అంశాలపై వివరించే నిమిత్తం కలెక్టరేట్ మీటింగ్ హాలులో అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

రికవరీ మేళా

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో 2025 నవంబర్ రికవరీ మేళాను శుక్రవారం నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ 2025 నవంబర్‌లో 70 కేసులు నమోదయ్యాయని, అందులో 53 కేసులను విజయవంతంగా ఛేదించామని నేరస్తులను అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా చోరీ అయిన సొత్తులో రూ.26,67,550 విలువ గల వస్తువులతో పాటు రూ.75,30,000 విలువ గల 502 మొబైల్ ఫోన్లను కలుపుకుని మొత్తం రూ. 1,01,97,550 విలువగల సొత్తు రికవరీ చేయడం జరిగిందని రికవరీ చేసిన వస్తువులను బాధితులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. నవంబర్‌లో రికవరీ చేసిన సొత్తులో 355.24 గ్రాముల బంగారం, 2164.42 గ్రాముల వెండి రూ.2,26,320 నగదు, 5 ద్విచక్ర వాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు.

మత్స్యకారుల విడుదలకు కృషి

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: బంగ్లాదేశ్‌లో పొరపాటున చిక్కుకున్న మత్స్యకారులను విడుదల చేసేందుకు కూటమి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోం దని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలని కోరుతూ బోటు అసోసియేషన్ పెద్దలు గురువారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను కలిసి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఎఫ్ఐఆర్ కాపీతో పాటు లాయరు వాంగ్మూలం, మత్స్యకారుల క్షేమ సమాచారం, ఆరోగ్య పరిస్థితిని గురించి వివరించారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



విద్యార్థినులతో ఆర్‌జెడి విజయ భాస్కర్

ప్రజాశక్తి- భీమునిపట్నం : టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యాశాఖ ఆర్‌జెడి కె విజయభాస్కర్ సూచించారు. శుక్రవారం జివిఎంసి మూడోవార్డులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతూ, ఇష్టపడి ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చన్నారు. టెన్త్‌లో మంచి మార్కులు, ర్యాంక్‌లు సాధించినట్లయితే భవిష్యత్ బాగుంటుందని భరోసా ఇచ్చారు. పరీక్షల సందర్భంగా ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిసిడిఒ శ్రీదేవి, డాక్టర్ మీనాక్షి , కెజిబివి ప్రిన్సిపాల్ గంగాకుమారి పాల్గొన్నారు.

కల్యాణ మండపం వేలంపాట

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభం గ్రామంలోని కుంతీ మాధవస్వామి ఆలయంలో శుక్రవారం కల్యాణమండపం వేలం పాట నిర్వహించారు. ఆలయం ఇఒ లక్ష్మీ నరసింహరాజు ఆధ్వర్యంలో ఏడాది కాలానికి లీజుకు ఇచ్చేందుకు వేలం పాట నిర్వహించగా, కోరాడ గెద్దపేటకు చెందిన గెద్ద శ్రీనివాసరావుకు అధిక మొత్తానికి వేలం పాడి రూ.3.35లక్షలకు దక్కించుకున్నారు.

వైఎస్ఆర్ కాలనీలో పోలీసుల కార్డెన్ సెర్చ్



తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -కొమ్మాది : జివిఎంసి ఐదోవార్డు వైఎస్సార్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున పీఎం.పాలెం పోలీసులు ముమ్మరంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. సిఐ జి.బాలకృష్ణ ఆదేశాల మేరకు ఎస్ఐలు బి.నరేష్, ఎన్.శ్రావణి తమ సిబ్బందితోకాలనీలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా స్థానికుల ఆధార్ కార్డులు, కాలనీలో నిలిపి ఉంచిన వాహనాల పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా సిఐ బాలకృష్ణ మాట్లాడుతూకొత్తవారికి ఇంటిని అద్దెకు ఇచ్చేటప్పుడు వారి పూర్తి వివరాలు, గుర్తింపు కార్డులను పరిశీలించి సరిగా ఉన్నాయని నిర్ధారించుకున్నాకే ఇళ్ల యజమానులు అద్దెకు ఇవ్వాలన్నారుకాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు,వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం

100 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -ఆనందపురం : అక్రమంగా రవాణా చేస్తున్న 100 కిలోల గంజాయిని ఆనందపురం పోలీసులు పట్టుకున్నారు వివరాలవి. స్థానిక ఎస్ఐ శివకు పక్కాగా అందిన సమాచారం మేరకు మండలంలోని మామిడిలోవ ఎంహెచ్16 రోడ్డుపై అనుమానాస్పదంగా ఉన్న టయోటా ఎటియోస్ కారును పరిశీలించగా, కారు డిక్కీలో 100 కేజీల గంజాయి లభ్యమైంది. ఒక్కొక్కటి 25 కేజీల చొప్పున నాలుగు గోనె సంచుల్లో ప్యాక్ చేసిన గంజాయిని పోలీసులు గుర్తించారు. గంజాయితో పాటుకారును స్వాధీనం చేసుకున్నారు. ఆనందపురం సిఐ సిహెచ్‌వాసునాయుడు కేసు నమోదు చేసి, నిందితుల గుర్తింపు, గంజాయి రవాణా వెనుక ఉన్న ముఠాపై దర్యాప్తు చేపట్టారు.

అంగన్వాడీలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ



స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి పద్మనాభం : ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 278 మందికి అంగన్వాడి కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పంపిణీ చేశారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో భీమిలి ప్రాజెక్టు సిడిపిఒ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పద్మనాభం మండలానికి చెందిన 57 మంది అంగన్వాడి కార్యకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంగన్వాడీ సేవలను మరింత సులభతరం చేయడం, లబ్ధిదారులకు పారదర్శకతతో కూడిన సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల వివరాలను అప్‌లోడ్ చేయడానికి, అధికారులు కోరిన సమాచారం ఇవ్వడానికి ఈస్మార్ట్‌ఫోన్లు ఉపయోగపడ తాయన్నారు. .కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎం.పార్వతి అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌ 64 వినతులు

పద్మనాభం :మండల పరిషత్ సర్వసభ్య సమావేశ మందిరంలో టిడిపి నేతల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 64 వినతులు వచ్చాయి, ఎంపిడిఒ నగేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొని 22పంచాయతీల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా గత టిడిపి ప్రభుత్వహయాంలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలని టిడిపి సీనియర్ నేత ఈగల శ్రీరామమూర్తి కోరారు. నరసాపురంలో అర్హులైన 200 కుటుంబాలకు ఇళ్లపట్టాలివ్వాలని మార్కెట్ కమిటీ డైరెక్టర్ అభి నందిని కోరారు. రేఖండంలో ఇళ్లపట్టాలిచ్చినా నేటికీ స్థలాలు చూపించలేదని వాడపల్లి సురేష్ ఆధ్వర్యంలో పట్టాదారులు కోరారు. 43విద్యుత్ స్తంభాలు కావాలని వెంకటాపురం సర్పంచ్ కె రమణ కోరారు.

కార్యక్రమంలో తహశీల్దారు కె.ఆనందరావు. మండల టిడిపి అధ్యక్షులు కే రమణ, మాజీ జెడ్‌పిటిసి కె.దామోదరరావు, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పి జగన్నాథం, టిడిపి మాజీ అధ్యక్షులు కే నగేష్ కుమార్, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు బి పావని, తెలుగు యువత మండల అధ్యక్షులు సత్యనారాయణ ,ఉపాధ్యక్షులు జి ప్రసాదు పాల్గొన్నారు.

కానరాని కూటమి నేతలు

మండల కేంద్రంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో టిడిపి మినహా ఇతర భాగస్వామ్య జనసేన, బిజెపి నేతలు హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. జనసేనకు చెందిన భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామినాయుడును ఆహ్వానించకపోవడంతో మార్కెట్ సమస్యలపై దరఖాస్తులు రాలేదు. కూటమి ప్రభుత్వం కావడంతో అందరు ప్రజాప్రతినిధులకు ఆహ్వానం ఉండాలని కొంతమంది అభిప్రాయపడ్డారు.

ముమ్మరంగా ఎన్‌సిసి సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- ములగాడ: అన్ని ఇంద్రియాల్లో కళ్లు అత్యంత ప్రముఖమైనవని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎంఎస్ఎల్. రాజు అన్నారు. శుక్రవారం జివిఎంసి 61వ వార్డు పల్లి వీధిలో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా, శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ, కంటి సమస్యలను ఉపేక్షించకూడదని, వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని అన్నారు. శిబిరంలో 61వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మజ్జి సోమేష్, వార్డు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మి, స్థానిక మహిళా నాయకురాలు నిర్మల, డాక్టర్ భాగ్యరాజు, మెడికవర్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ అభిరామ్, ఎన్‌సిసి జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. 100 మందికి ఉచిత కంటి పరీక్షలను చేసి, 30 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ప్రకాష్ నగర్ ప్రియదర్శిని కాలనీలో ఎన్‌సిసి యూనిట్ -2 వై. అనసూయ దేవి ఆధ్వర్యంలోనూ, వెంకన్నపాలెంలో యూనిట్-3 అంజలీ దేవి నాయకత్వంలో ఎన్‌సిసి క్యాడెట్లు పలు అంశాలపై సర్వేను నిర్వహించారు. డిజిటల్ లావాదేవీలు, జీవవైవిధ్యంపై అవగాహన కలిగించారు. జవహర్ నగర్, ఇందిరా కాలనీలో సర్వేతోపాటు,యోగా తరగతులను నిర్వహించారు. సంధ్యారాణి, నదియా ఆధ్వర్యంలోబాల కార్మిక వ్యవస్థను నిర్మూలనపై బృంద చర్చలు జరిపారు.

ఘనంగా పలుచోట్ల వీర బాల దివస్



కొమ్మాదిలో వీర బాల దివస్ వేడుకల్లో సిఐ బాలకృష్ణ, నిర్వాహకులు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 51వ వార్డు గాంధీ నగర్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం వీర్ బాల దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు చిత్ర లేఖనం, వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త మౌలా బీబీ మాట్లాడుతూ భావిభారత పౌరులైన గౌరవించడానికి, 'వీర్ బాల్ దివస్‌ను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. యువ మనస్సులను తీర్చిదిద్దడం, సృజనాత్మకతను పెంపొందించడం, వికసిత భారతదేశం దార్శనికతకు చురుకుగా సహకరించేలా పిల్లలు, యువతను ప్రేరేపించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

కొమ్మాది : గురజాడనగర్, కె1 కాలనీ గురుద్వారాలో శుక్రవారం వీరబాలదివస్ నిర్వహించారు. బాబా జోరవర్ సింగ్, బాబా ఫతేసింగ్ చిత్రపటాలకు స్థానిక సిఐ బాలకృష్ణ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులకు, పిల్లలకు ధైర్య సాహసాలు, దేశభక్తి, సత్యమునే మాట్లాడుట, నేర్పించాలని కోరారు కార్యక్రమంలోఉత్తరాంధ్ర కన్వీనర్ సుహాసిని ఆనంద్ , విశాఖ జిల్లా కన్వీనర్ రూపాకుల రవికుమార్, కో కన్వీనర్ ఎస్.దానేష్, చోడవరపు రాజు, కెఎన్‌పి చక్రవర్తి, కైలాస రెడ్డి, పోతిన నానాజీ, జానకిరామ్, కనకరాజు పాల్గొన్నారు.

పాయకరావుపేట : మండలంలోని మంగవరం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం "వీర్ బాలా దివస్" కార్యక్రమం నిర్వహించారు. స్కూల్లోని డిజిటల్ క్లాస్ రూమ్‌లో లైవ్ టెలికాస్ట్ వేసి విద్యార్థులు అందరికి వివరించారు. ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లలిత, రంజాన్ బీబీ, అంగన్వాడీ కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసు ఛేదించిన పోలీసులు

ఏడుగురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి విశ్వస్వరూప్

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ పోలీస్‌స్టేషన్ పరిధి లంకెలపాలెం శ్రీరాంనగర్ కాలనీలో జరిగిన ఈనెల 23న అర్ధరాత్రి జరిగిన హత్య కేసును పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. మృతుడు లంకెలపాలెం శ్రీరాంనగర్‌కు చెందిన ఈగల వెంకునాయుడు (39) భార్య మొల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ పర్యవేక్షణలో సిఐ ఆర్.మల్లికార్జునరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... వెంకునాయుడు శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన దాసరి తేజతో పరిచయంలో ఉండేవాడు. ఆయన కూర్మన్నపాలెంలో జిమ్ నిర్వహిస్తున్నాడు. అయితే వ్యభిచార కార్యకలాపాలకు సంబంధించి దాసరి తేజకు వెంకునాయుడు సహకరించకపోవడంతో పాటు ఇతరులకు మద్దతు ఇస్తుండటంతో అతనిపై కక్ష పెంచుకున్నట్లు తేలింది. ఈనెల 23న రాత్రి దువ్వాడలోని ఓ వైన్‌షాప్ వద్ద సమావేశమై హత్యకు కుట్ర పన్నారు. అనంతరం అర్ధరాత్రి మృతుడిని బయటకు రప్పించి సిద్ధంగా ఉంచిన పెద్ద రాయితో తలపై, ముఖంపై దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. కొందరు నిందితులు ప్రత్యక్ష దాడిలో పాల్గొనగా, మరికొందరు పారిపోవడానికి సహకరించినట్లు వెల్లడైంది. నిందితులు దాసరి తేజ (కుట్రదారు), కనాటి దేవుడు నాయుడు (దాడిలో పాల్గొన్నారు), గొల్లు దినేష్ కుమార్ (దాడికి సహకారం) చింతాడ సూర్యప్రకాశ్ (ఆర్థిక, లాజిస్టిక్ సహాయం), గుడే జాన్ ప్రశాంత్ కుమార్ (ఎస్కేప్‌కు సహకారం), అదురి దాసు (ఆటో ద్వారా పారిపోవడానికి సహాయం), గండేటి వంశీ (ఎస్కేప్ ప్లాన్‌లో భాగస్వామి)లను శుక్రవారం మధ్యాహ్నం లంకెలపాలెం సమీపంలోని హైవే మూడు మదుముల జంక్షన్ వద్ద, గాజువాక దుర్గానగర్‌లోనూ అరెస్టు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచారు. హత్య కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసులను జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

బోటును ఢీకొట్టిన కార్గో షిప్

మత్స్యకారుడు గల్లంతు



ఒడ్డుకు చేరిన మత్స్యకారులు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : అచ్యుతాపురం మండలం పూడిమడక సమీపంలోని బంగాళాఖాతంలో శుక్రవారం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు కొమరణి నీలాకరి(41) గల్లంతయ్యాడు. తోటి మత్స్యకారులు తెలిపిన వివరాలు ప్రకారం... రాంబిల్లి మండలం, కొత్తపట్నంకు చెందిన నీలాకరి అచ్యుతాపురానికి చెందిన మరో ఐదుగురితో కలిసి శుక్రవారం తెల్లవారు 3గంటలకు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. వేట ముగించుకొని తిరిగి వస్తుండగా మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కార్గో షిప్ వారి బోటును ఢీకొట్టింది. దీంతో బోటులో ఉన్న మత్స్యకారులు సముద్రంలో దూకేశారు. అనంతరం ఐదుగురు మాత్రమే సురక్షితంగా బోటు వద్దకి చేరారు. నీలాకరి సముద్రంలో గల్లంతయ్యాడు. ఎంత వెతికినా నీలాకరి కనిపించకపోవడంతో తోటి మత్స్యకారులు ప్రమాదం జరిగిన బోటులోనే తిరిగి పూడిమడక తీరానికి చేరుకున్నారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే మెరైన్ పోలీసులు, స్థానిక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో వినూత్న ఆవిష్కరణలు

అవంతి కళాశాలలో గ్యాస్ 2కె25 సాంకేతిక ఉత్సవం



జ్యోతి ప్రజ్వళనతో ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గ్యాస్ 2కె25 పేరుతో నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవాన్ని అవంతి విద్యాసంస్థల చైర్మెన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అవంతి చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు పలు దేశాల్లోని ఉన్నత ఉద్యోగులుగా స్థిరపడ్డారన్నారు. యువత భవిష్యత్తుకు అవంతి విద్యాసంస్థలు పునాది వేశాయన్నారు. పుట్టుకతోనే ఎవ్వరూ గొప్పవారు కాలేరని, లక్ష్యాలను నిర్ధేశించుకుని, సవాళ్లను ఎదుర్కొంటూ కష్టపడి ముందుకు వెళ్లాలని సూచించారు.

ఉత్సవంలో వవిధ కళాశాలలు నుండి 3100 మంది విద్యార్థులు పాల్గొని 102 ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. స్మార్ట్ శానిటేషన్ ప్రాజెక్ట్, హీట్ ట్రీటెడ్ వెల్డింగ్ బ్లైండ్ స్టిక్, స్మార్ట్ వాకింగ్ స్టిక్ వంటి పలు ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించారు. ప్రొఫెసర్ శాలివాహన్, కొంచాడ కిషోర్ కుమార్, రీతూ బర్నదత్త, సిస్టర్ మణి, అవంతి విద్యాసంస్థల జనరల్ సెక్రెటరీ ముత్తంశెట్టి ప్రియాంక, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ అడ్మిన్ డైరెక్టర్ విశ్వ ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు

95 యూనిట్ల రక్త సేకరణ

ఎన్ఎస్ఆర్ఐటిలో రక్తదాన శిబిరం



సర్టిఫికెట్లతో రక్తదాతలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి) కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విశాఖపట్నం ఎన్‌టిఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, సిఎంఒ డాక్టర్ సుబ్బరాజు మాట్లాడుతూ ఒకరు ఒకసారి చేసిన రక్తదానంతో ముగ్గురు ప్రాణాలను కాపాడొచ్చన్నార. యువత రక్తదానానికి ముందుకు రావడం సమాజానికి అవసరమని సూచించారు. రక్తదానం చేసిన విద్యార్థులు, సిబ్బందిని అభినందించారు.ఈ సందర్భంగా 95 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ హరగోపాల్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు, స్టూడెంట్ వాలంటీర్లు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

స్మార్ట్‌సిటీ రిపోర్టర్స్ డైరీ ఆవిష్కరణ



స్మార్ట్‌సిటీ రిపోర్టర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరిస్తున్న సిపి బగ్చీ

ప్రజాశక్తి- సీతమ్మధార : కలం చాలా బలమైనదని, అయితే దాన్ని ఉయోగించే తీరే అతి ముఖ్యమని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. పాత్రికేయులు తమ కలాన్ని వాస్తవిక దృక్పథంతో కచ్చితంగా ఉపయోగించాలని, ఊహగానాలకు తావివ్వరాదని సూచించారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ-2026 ఆవిష్కరణలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులు మంచి కథనాల ద్వారా వైజాగ్ బ్రాండ్ విశిష్టత నిలబెట్టాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెలేేర్ అసోసియేషన్ చేస్తున్న సేవలు అద్వితీయమన్నారు. సమాజ సేవలో కూడా జర్నలిస్టులు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులు వాస్తవాలకు మాత్రమే అద్దం పట్టే కథనాలు రాయాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్ అధ్యక్షతన కార్యక్రమంలో ఎన్‌యుజెఐ స్కూల్ ఆఫ్ జర్నలిజం చైర్మన్ ఎన్. నాగేశ్వరరావు అసోసియేషన్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో కుమారి అపర్ణ నృత్యాలు, దేవి ప్రసాద్ పర్యావరణంపై పాడిన పాట, ఈటీవీ, జీ తెలుగు ఫేమ్ ఎంఎస్ఆర్ నాయుడు మిమిక్రీ మెప్పించింది. జర్నలిస్టులకు సంవత్సర డైరీ, స్వీట్స్, పండ్లు అందజేశారు.అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థి రవి వితల్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-మధురవాడ :వస్త్ర పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాల వల్ల ఏర్పడుతున్న జలకాలుష్యం నివారణకు జరిపిన పరిశోధనలకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ టెక్నాలజి బయోటెక్నాలజీ విభాగం పరిశోధకుడు డాక్టర్ రవివితల్ కందిశకు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. వస్త్ర పరిశ్రమలలో సింథటిక్ రంగులను ముఖ్యంగా మిథైల్ బ్లూ, మాల్‌చైట్ గ్రీన్ రంగులను వాడటం వల్ల అవి పారిశ్రామిక వ్యర్థాలుగా మారి, పరిశ్రమల సమీపంలోని నీటి వనరులను కాలుష్యానికి గురుచేస్తున్నాయని డాక్టర్ రవి తెలిపారు.. బయో టెక్నాలజి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కెవి నారాయణ సాయిబాబా మార్గనిర్దేకత్వంలో పరిశోధన చేశారు.


గ్రామ పంచాయతీ కుర్చీ ట్రైలర్ ఆవిష్కరణ



చిత్ర ట్రైలరు ఆవిష్కరిస్తున్న వెంకటేష్ గౌడ్.

ప్రజాశక్తి- గాజువాక : 'గ్రామ పంచాయతీ కుర్చీ' లఘుచిత్ర ట్రైలరును శుక్రవారం గాజువాకలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర బిసి యువజన సంఘం అధ్యక్షులు ఏకుల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ,గ్రామపంచాయతీలలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగంపై ప్రశ్నించడం ద్వారా గ్రామాల అభివృద్ధికి కృషి చేయడమనే ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని మంచి సందేశాత్మకంగా రూపొందించడం అభినందనీయ మన్నారు. భవిష్యత్‌లో సమాజానికి ఉపయోగపడే మరిన్ని మంచి చిత్రాలను నిర్మించాలని కోరారు. చిత్ర దర్శక, నిర్మాతలు, నటీనటులు, సాంకేతిక బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు నానినాయుడు, నిర్మాత జిఆర్‌కె మ్యూజిక్ ఛానల్ అధినేత జి.ఈశ్వర్, డిఒపి ఎడిటర్ హరీష్ పట్నాయక్. ఎస్‌కెఎంఎల్ అధినేత ప్రదీప్, ప్రొడక్షన్ మేనేజర్ రెడ్డి స్వామి, నటి నటులు హీరో నాగసూర్య, హీరోయిన్ రేష్మ, నటులు సిరసపల్లి వెంకటరమణ, గెద్దాడ అప్పలరాజు, నాని వెంకట్, ఉషశ్రీ, దివ్యతేజ, రవిశెట్టి పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రంలో బిగ్‌బాస్ విజేత



బిగ్ బాస్ 9 తెలుగు విజేత కల్యాణ్‌ను సత్కరిస్తున్న బాలల సంరక్షణ కేంద్రం నిర్వాహకులు

ప్రజాశక్తి -తగరపువలస: భీముని పట్నం మండలం తాళ్లవలస పంచాయతీలోని భరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రాన్ని బిగ్ బాస్ 9 తెలుగు విజేత కల్యాణ్ పడాల సందర్శించారు. పిల్లలతో కళ్యాణ్ పడాలకు మంచి అనుబంధం ఉందని నిర్వాహకులు వెంపాడ శ్రీనివాసరెడ్డితెలిపారు. కళ్యాణ్ మాట్లాడుతూ భగవంతుడు ఆశీస్సులు అభిమానులు సహకారంతో బిగ్ బాస్ 9తెలుగు విజేతగా నిలిచానన్నారు. అనంతరం బాలల సంరక్షణ కేంద్రం పిల్లల మధ్య కేక్ కటింగ్ చేసి పిల్లలకు భోజనం సమకూర్చి,ఆనందంగా గడిపారు. ట్రస్ట్ నిర్వాహకులు వెంపాడ శ్రీనివాస్‌రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అక్కరమాని సంధ్య, కోలాటం మాస్టర్ సాయి, అత్తాడ అవినాష్, పద్మ, సంధ్య,.రాజీ పిల్లలు పాల్గొన్నారు

మార్కెట్ యార్డ్ స్థలంలో తుప్పల తొలగింపు



పనులను పర్యవేక్షిస్తున్న ఎంఎంసి చైర్మన్, సెక్రటరీ

ప్రజాశక్తి - ఆనందపురం ఆనందపురం వ్యవసాయ మార్కెట్ యార్డును త్వరలోనే రైతుల వినియోగంలోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మార్కెట్ యార్డ్ పరిసరాలలో పేరుకుపోయిన తుప్పలు, పొదలను తొలగించే పనులు ప్రారంభించారు.

స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు త్వరలో మార్కెట్ యార్డును పరిశీలించనున్న నేపథ్యంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామినాయుడు ఆదేశాల మేరకు మార్కెట్ కమిటీ సెక్రటరీ లక్ష్మీ చైతన్య జెసిబి యంత్రాలు రప్పించి, కార్మికులతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. శుక్రవారం ఆయా పనులను ఎంఎంసి చైర్మన్ కురిమిన స్వామినాయుడు, సెక్రటరీ లక్ష్మీచైతన్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి పరిశీలించారు. త్వరలోనే ఈ మార్కెట్ యార్డు వినియోగంలోకి రానుందని అధికారులు వెల్లడించారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఎడిఇ కోటేశ్వరరావు

ప్రజాశక్తి- వేపగుంట : కేంద్ర ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న సూర్యఘర్ పథకం సోలార్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎపిఇపిడిసిఎల్ , పెందుర్తి ఎడిఇ చుక్కాకుల కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ సోలార్ యూనిట్లతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడు కిలోవాట్ రూఫ్ టాప్ సోలార్ యూనిట్ వ్యయం రూ.2.10లక్షలు కాగా, కేంద్ర ప్రభుత్వం రూ.78వేలు రాయితీ ఇస్తుందన్నారు. రెండు కిలోవాట్ సోలార్ యూనిట్ ఏర్పాటు వ్యయం రూ.1.80లక్షలు కాఅ, కేంద్రం రూ.60వేలు సబ్సిడీ ఇస్తుందని, అదే ఒక కిలో వాట్ సోలార్ యూనిట్ ఏర్పాటుకు రూ.1.30లక్షలు ఖర్చయితే రూ 30 వేల సబ్సిడీ లభిస్తుందన్నారు సోలార్ యూనిట్ల ఏర్పాటులో విశాఖ జిల్లాలో పెందుర్తి మండలంప్రథమ స్థానంలో ఉందఎని, ఇప్పటివరకు 750గృహాలకు సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జిప్సా కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎంఎల్‌సి, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం జిప్సా ప్రతినిధులు మాట్లాడుతూ ఈ టేబుల్‌టాప్ క్యాలెండర్‌లను ఆదివారం అప్పికొండ బీచ్‌లో జరగనున్న జిప్సా పిక్నిక్‌లో సభ్యులందరికీ పంచి పెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిప్సా గౌరవ అధ్యక్షులు పి. భాస్కరరావు, అధ్యక్షుడు బి శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.బాబూరావు, కార్యవర్గ సభ్యులు మురళీ సుందర్, జె రమేష్ నాయుడు, చంద్ర మౌళి పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న సన్నిధిలో ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ మనోజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్నను ఉత్తరాఖండ్ (నైనిటాల్) హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ కుమార్ తివారీ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇఒ ఎన్. సుజాత ఆదేశాలతో ఆలయ పర్యవేక్షణాధికారి బి. సత్యశ్రీనివాస్ (వాసు) ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం, బేడామండపం ప్రదక్షిణ, ఆలయ అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను, శిల్పకళా సౌందర్యాన్ని ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాశస్త్యాన్ని సస్టిస్ మనోజ్‌కుమార్ తివారి కుటుంబసభ్యులకు ఆలయ అధికారులు వివరించారు. అనంతరం ఆలయ పర్యవేక్షణాధికారి బి. సత్య శ్రీనివాస్ స్వామి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించి, అప్పన్న ప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. పిఆర్ఒ నాయుడు పాల్గొన్నారు.

సిపిఎం నేత

అప్పలరాజును విడుదల చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకుల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు, పాల్గొన్న నాయకులు



దేశపాత్రునిపాలెంలో నిరసన తెలుపుతున్న సిపిఎం కార్యకర్తలు

ప్రజాశక్తి-అనకాపల్లి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఏపి రైతుసంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజుపై అక్రమంగా పెట్టిన పీడీ చట్టం ఉపసంహరించి వెంటనే ఆయన్ను బేషరతుగా విడుదల చేయాలని అఖిల పక్షాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ప్రజా సమస్యలపై పోరాడుతున్న అప్పలరాజుపై తప్పుడు కేసులు బనాయించి చట్టవిరుద్ధంగా నిర్బంధించడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శంకర్రావు మాట్లాడుతూ నక్కపల్లి బల్క్ డ్రగ్‌కి వ్యతిరేకంగా మత్స్యకారులు, నిర్వాసిత రైతులు చేస్తున్న పోరాటానికి అప్పలరాజు అండగా ఉన్నారని తెలిపారు. గంజాయి వ్యాపారులు, రౌడీ షీటర్లు, భూ కబ్జాదారులు, మహిళలను అక్రమంగా తరలిస్తున్న వారిపై పెట్టే పీడీ యాక్టును ప్రజా ఉద్యమ నేతపై బనాయించడం రాష్ట్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. అప్పలరాజుపై ప్రభుత్వం చూపుతున్న 19 కేసుల్లో అత్యధికభాగం 151 సెక్షన్ కేసులే ఉన్నాయని, ఈ కేసులను పరిశీలిస్తే ఆయన స్థానిక నిర్వాసితులు, బాధితుల పక్షాన నిలబడినట్లు విధితమవుతుందని తెలిపారు. భూసేకరణకు అడ్డుపడేవారిపై పిడి యాక్టు ప్రయోగించాలని ముఖ్యమంత్రి ఆదేశించిన వెంటనే కలెక్టర్ అప్పలరాజుపై ఇప్పటి వరకు ఉన్న నేర చరిత్ర ఏమిటో కూడా పరిశీలించకుండానే పీడీ యార్డు నమోదు చేస్తూ ఆర్డర్ జారీ చేయడం దుర్మార్గ మన్నారు. చట్టవిరుద్ధంగా కేసులు బనాయించడంపై ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, ఖండించాలని, అప్పలరాజుపై పీడీ యాక్టు కేసును ఉప సంహరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కే.మోహన్ రావు, మహిళా సమైక్య కార్యదర్శి బి.పరమేశ్వరి, బీఎస్పీ జిల్లా నాయకులు ఎస్.మాణిక్యాలరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర, నాయకులు బాబ్జీ, వార్తా కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు, సిఐటియు నాయకులు కే.తేలయ్య బాబు, ఏఐవైఎఫ్ కార్యదర్శి వి.రాజు పాల్గొన్నారు.

అప్పలరాజుపై పీడీ యార్డు నమోదుపై నిరసన

పరవాడ : సిపిఎం నేత యం.అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పిడి చట్టం కేసును వెంటనే ఉపసంహరించాలని కోరుతూ మండలంలోని దేశపాత్రునిపాలెంలో శుక్రవారం సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా నాయకులు వి.వి.రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం ప్రజా ఉద్యమకారులను పీడీ యాక్ట్ పెడుతుందని విమర్శించారు. పారిశ్రామికవేత్తల అడుగులకు మడుగులత్తుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను భయపెట్టేందుకు చేస్తున్న ఇటువంటి చర్యలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వంజరాపు వెంకటరమణ, పళ్ళ దానినాయుడ, రామ్మూర్తి, లక్ష్మీ, రాజులమ్మ, అప్పారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలు విడుదల

నక్కపల్లి : సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు పై పీడీ యాక్ట్ ను రద్దుచేసి, వెంటనే విడుదల చేయాలని ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు మైలపల్లి మహేష్ డిమాండ్ చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో మత్స్యకారులు, మత్స్యకార మహిళలు శుక్రవారం అప్పలరాజుపై పెట్టిన తప్పుడు కేసులు ఖండిస్తూ గోడపత్రికలను విడుదల చేసారు. పేద ప్రజలకు, మత్స్యకారులకు, రైతులకు,వివిధ వృత్తిదారులకు అండగా నిలిచిన అప్పలరాజు పై అన్యాయంగా కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు కాళ్ళ దేముడు, బొంది నూకమ్మ, జి.స్వామి, ఎం.కాశి, సిహెచ్.రాజు, ఎం.నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు, మత్స్యకారులు



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

క్రికెట్ టోర్నమెంట్ విజేత పెద్దపల్లి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి డిగ్రీ కళాశాల మైదానంలో లోకిరెడ్డి రవిచంద్రనాయుడు స్నేహితులు ఆధ్వర్యంలో డిసెంబర్ 8న ప్రారంభమైన రాయుడు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఈ టోర్నమెంట్లో మొత్తం 50 టీమ్‌లు పాల్గొన్నగా శుక్రవారం ఫైనల్ మ్యాచ్ పెద్దపల్లి, గోపాలపట్నం మధ్య జరిగింది. ఫైనల్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన పెద్దపల్లి 114 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గోపాలపట్నం 57 పరుగులు మాత్రమే చేసింది. విజేత పెద్దపల్లి జట్టుకు రూ.50,000 నగదు, షీల్డ్, రన్నరప్ గోపాలపట్నం జట్టుకు రూ.30,000 నగదు షీల్డ్, మూడవ విజేతగా రాయుడు-11 జట్టుకు రూ.20000 నగదు, షీల్డ్ అందజేశారు. బెస్ట్ బౌలర్ బాబూరావు, బెస్ట్ బ్యాట్స్‌మెన్ బి శ్రీను, టోర్నమెంట్ వాల్యూబుల్ ప్లేయర్‌గా బాబూరావు వ్యక్తిగత షీల్డ్స్ గెలుచుకున్నారు. విజేతలకు రాయుడు కుటుంబ సభ్యులు బహుమతి ప్రదానం చేశారు. విజేత అయినా పెద్దపల్లి జట్టుకి కౌన్సిలర్ రూ.5000 నగదు ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు.

28 నుంచి ఆహ్వాన నాటకోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జార్జి క్లబ్ ఆవరణలో ఈనెల 28 నుంచి 30 వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నాటకోత్సవాల కన్వీనర్ కే యం నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మహతి క్రియేషన్స్ ఆధ్వర్యంలో జరిగే ఈ నాటకోత్సవాలు జార్జి క్లబ్ కొణతాల వెంకట నారాయణమ్మ కళా ప్రాంగణంలో జరుగుతాయని పేర్కొన్నారు. 28వ తేదీన సాయంత్రం 6:30 గంటలకు గుంటూరు అభినయ్ ఆర్ట్స్ వారి సమయం నాటిక, రాత్రి 7:45 గంటలకు హైదరాబాద్ మల్లేశ్వరి ఆర్ట్స్ వారి నువ్వో సగం నేనో సగం నాటిక, 29న హైదరాబాద్ స్వర్ణ సూర్య డ్రామా లవర్స్ వారి స్త్రీ మాత్రే నమ: నాటిక, రాత్రి 7.45 గంటలకు కాకినాడ బివికే క్రియేషన్స్ వారి కన్నీటికి విలువెంత నాటిక, 30న శ్రీకాకుళం బొల్లివంక శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సంఘం వారి మాయాజాలం, రాత్రి 7.45 గంటలకు పెందుర్తి శ్రీ నటరాజ డ్రమటిక్ అసోసియేషన్ నీళ్లు నీళ్లు నాటిక ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నాటిక అనంతరం లక్కీ డిప్ ద్వారా బహుమతులు పొందే అవకాశం ఉందన్నారు.

31న పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ 31వ తేదీనే పంపిణీ చేస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1వ తేదీన నూతన సంవత్సరం వేడుక దృష్ట్యా ముందు రోజునే పింఛన్ దారులకు సంబంధిత సిబ్బంది ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ నగదు అందచేస్తారని పేర్కొన్నారు.

84వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : జివిఎంసి 84వ వార్డు పరిధి లక్ష్మీనారాయణ నగర్‌లో మరిడిమాంబ గుడి నుండి లక్ష్మీనారాయణ నగర్ వరకు జీవీఎంసీ నిధులు కోటి రూపాయలు చేస్తున్న సిమెంట్ రోడ్డు, కాలువ నిర్మాణ పనులను వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మాదంశెట్టి నీలబాబు శుక్రవారం పనులను పార్టీ నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. వారు కార్పొరేటర్ చిన్నతల్లి రూ.5 కోట్ల నిధులతో చేసిన ప్రతిపాదనలకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గే నిధులు మంజూరు చేయడంతో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ఒకే సమయంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో 84వ వార్డు టిడిపి అధ్యక్షుడు తలారి ప్రసాదు, కార్యదర్శి సాలాపు మోహను, కోట్ని రాంబాబు, పిళ్ళా తారకేశు పాల్గొన్నారు.




పనులను పరిశీలిస్తున్న టిడిపి నేత నీలబాబు

ప్రభుత్వ భూమిని రక్షించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం కోడూరు రెవెన్యూ సర్వేనెంబరు 45లో ప్రభుత్వ భూమి సుమారు 4 ఎకరాలను రక్షించాలని సిపిఎం మండల కార్యదర్శి గంట శ్రీరామ్ తహశీల్దారుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ భూమిని కబ్జా చేయడమే కాక, లక్షల రూపాయలు విలువ చేసే యూకలిప్టస్ చెట్లను నరికి వేయడంతో ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. అదీ జిల్లా కలెక్టరు బంగ్లా ఎదుట భూమి ఆక్రమణను అడ్డుకోలేని పరిస్థితులు రెవెన్యూ అధికారులకు ఉండటాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇప్పటికైనా ఆక్రమాలను అడ్డుకోవాలని కోరారు.

నేడే కుంచావారి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలో కుంచావారి శ్రీగౌరీపరమేశ్వరుల అమ్మవారు మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 214 సంవత్సరాల ఘన చరిత్ర గల అమ్మవారు ఉత్సవాలు సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఎం వీరభద్రరావు (అబ్బులు) మాట్లాడుతూ పండగ సందర్భంగా గవర పాలెం శ్రీ గౌరీ పరమేశ్వరి కమిటీ, వేల్పుల వీధి శ్రీ గౌరీ పరమేశ్వరి కమిటీ సభ్యులు అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారని తెలిపారు. గౌరీ పరమేశ్వర జాతర రోజున అమ్మవారి కి ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. అమ్మవారి దర్శించుకునేందుకు వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, అధికారులు వస్తారని తెలియజేశారు. ముస్తాబైన అమ్మవారి ఆలయ పరిసరాలు ప్రాంతాలు, భారీ విద్యుత్ అలంకరణ, పలు సంస్కృతి కార్యక్రమాలు, డాన్స్ బేబీ డాన్స్ ప్రోగ్రాలు, బుర్రకథ, నేల వేషాలు, కోలాటాలు, బాణాసంచిక, జాతర తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని పేర్కొన్నారు.



విద్యాశాఖతో సంబంధం లేని అధికారుల నియామకం సరికాదు

యుటిఎఫ్ జిల్లాప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయ్

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన వందరోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి విద్యాశాఖతో సంబంధంలేని ఇతర డిపార్ట్మెంట్స్ అధికారులను నియమించడం సరికాదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో మెరుగైన ఫలితాలను సాధించాలని సంకల్పించి ఈ ప్రణాళికను అమలు చేయడం సంతోషకరమైనప్పటికీ, సెలవు రోజుల్లో కూడా పనిచేయాలనే నిబంధన పెట్టి, పండుగ సెలవుల్లో కూడా ఈ ప్రణాళికను అమలు చేయమనడం సరికాదని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ ప్రణాళిక అమలు చేసి, సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల మధ్యలో ఒక స్లిప్ టెస్ట్ నిర్వహించి 24 గంటల్లో ఆ పరీక్ష పేపర్లను దిద్ది ఆన్లైన్లో మార్కులు అప్లోడ్ చేయమనడం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తీవ్రమైన మానసిక ఒత్తిడిని కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క విద్యాశాఖతో సంబంధం లేని మెడికల్, రెవెన్యూ, పోలీస్, ఇంజనీరింగ్, పంచాయతీరాజ్, పౌర సరఫరాలు, వంటి శాఖల అధికారులతో ఒక బృందం ఏర్పాటు చేసి, పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల ప్రగతి, అభ్యసనా స్థాయిలను పరిశీలించమనడం, ఉపాధ్యాయులు అమలు చేస్తున్న తీరుతెన్నులను పరిశీలించమని చెప్పడం తీవ్ర అభ్యంతరకరమని స్పష్టం చేశారు. ఇతర శాఖల అధికారులను పాఠశాలలపై నియమించడాన్ని ఆయన తప్పుపట్టారు. ఈ ప్రక్రియ ఉపాధ్యాయ వర్గాన్ని అవమానించడంతో సమానమని, తక్షణమే ఈ ప్రక్రియను ప్రభుత్వం ఆపివేయాలని డిమాండ్ చేశారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో దేశం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందిందని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక డైట్ అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ వర్థంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రత్నాకర్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ 10 సంవత్సరాలు భారతదేశాన్ని ప్రధానమంత్రిగా ఆర్థిక రంగంలో ఎన్నో కీలక మార్పులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారని తెలిపారు. ఆయన నిజాయితీ, నిస్వార్థమైన సేవలు అందించారని, ఆర్థిక శాస్త్రవేత్తగా భారతదేశంలో పెను మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ గ్లోబలైజేషన్ తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కిరణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న రత్నాకర్ తదితరులు


కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రౌడీ షీటర్లకు పోలీసు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పాయకరావుపేట : పాయకరావుపేట పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గంటలాన అప్పన్న ఆదేశాలు మేరకు ఎస్ఐ జుత్తు పురుషోత్తం మండలంలోని అనుమానితులు, రౌడీ షీటర్లు అందరినీ శుక్రవారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగలు సందర్భంగా పాయకరావుపేట మండల పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుపరాదని, అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనరాదని, ఎటువంటి నేరాలు, దొంగతనాలు జరగకూడదని స్పష్టం చేశారు. ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు, కొత్త వ్యక్తులు వచ్చినా తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, రాత్రి సమయంలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగిన ఎడల వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని హెచ్చరించారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి : పంచకర్ల

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి, బాట జంగాలపాలెం పంచాయతీల అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. మండలంలోని బాటజంగాలపాలెం, అసకపల్లి గ్రామాలలో శుక్రవారం జరిగిన మన పల్లె- మన ఎమ్మెల్యే కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అసకపల్లి నుండి లంకెలపాలెం రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అసకపల్లిలో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అసకపల్లి గ్రామంలో కళ్యాణ మండపం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, స్మశాన వాటికల అభివృద్ధికి రానున్న రెండు సంవత్సరాల్లో ఐదున్నర కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. కళ్యాణ మండపానికి 50 లక్షలు నిధులు తక్షణమే మంజూరు చేసినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీడీవో పి.పద్మజ, డిటి సిహెచ్.అప్పారావు, బాట జంగాల పాలెం సర్పంచ్ పడాల వెంకటరమణ, అసకపల్లి సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఎంపీటీసీలు చొక్కాకుల గోవింద్, మామిడి లక్ష్మి కొండాజీ, కర్రి అప్పారావు, శీరం అప్పలరాజు, కూటమి నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, కర్రి కనకరాజు, భరణికాన సాయినాదరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు


సదరం సర్టిఫికెటు అందజేస్తున్న దృశ్యం

వికలాంగురాలికి సర్టిఫికెట్ అందజేత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన చేబోలు కొండమ్మకు వైద్యులు మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్‌ను శుక్రవారం అందజేశారు. కొంతకాలంగా మంచానికే పరిమితమై ఉండటంతో సర్టిఫికెట్ మంజూరైంది. కార్యక్రమంలో సర్పంచ్ సీతా బుజ్జి, ఎంపీటీసీ సీత సన్యాసినాయుడు, సీత మాణిక్యం, నాగరాజు, సీత గణేష్, ఆకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నాయకులను సత్కరించిన గండి బాబ్జి

గండి బాబ్జిని కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-సబ్బవరం : టిడిపి పదవులకు ఇటీవల కొత్తగా ఎంపికైన నాయకులు టిడిపి నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జిని ఆయన స్వగృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. నకాపల్లి జిల్లా పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షులు గవర సత్తిబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి అంగటి లక్ష్మినానాజీ, గండి దేముడు, అధికార ప్రతినిధి రేసుపూడి రమణ, కార్యదర్శి ఈపు అప్పలరాజు తదితరులు బాబ్జిని కలిశారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో భర్తికాన బాబురావు, టిడిపి మండల అధ్యక్షులు గండి ముత్యాల నాయుడు, పెద్దాడ రమణమ్మ, కార్పొరేటర్ మెల్లి ముత్యాలునాయుడు, బొండా సత్యారావు, కోరాడ శ్రీను, కరణం రామునాయుడు, బంగారు నాయుడు, కె.రామకృష్ణరాజు, గొర్లి చైతన్య, దాసరి వెంకట రమణ, ఆకుల గణేష్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిన్ స్విమ్మింగ్‌లో జయదీప్ ప్రతిభ

ప్రజాశక్తి-పరవాడ : కర్ణాటక రాష్ట్రం మంగుళూరులో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో 50 మీటర్ల అప్నియా విభాగంలో మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థి జంగం జయదీప్ ప్రతిభ చూపించి రజిత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. జయదీప్‌కు ఘన స్వాగతం పలికి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జయదీప్‌ను, ఆయన కోచ్ హరినాథ్ రెడ్డిని స్కూల్ యాజమాన్యం శుక్రవారం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్ పాల్గొన్నారు.


జయదీప్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

తాతయ్యబాబుకు అభినందనలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : టిడిపి జిల్లా అధ్యక్షునిగా రెండోసారి నియామకమైన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబును పలు గ్రామాలకు చెందిన నాయకులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. బుచ్చయ్యపేట, చోడవరం, రావికమతం తదితర మండలాలకు చెందిన నాయకులు కలిశారు.

నష్టపరిహారం ఇవ్వాలని ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : సుజల స్రవంతి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ శుక్రవారం తుమ్మపాల గ్రామానికి చెందిన రైతులు ఆర్డీవో ఆయిషాకు వినతి పత్రం అందజేశారు. పోలవరం ఎడమ కాలువ ప్రాజెక్టులో భాగంగా 2022లో తమ భూములు 100 ఎకరాలు జిరాయితీ, 40 ఎకరాలు కొన్ని దశాబ్దాలుగా అనుభవిస్తున్న బంజరు భూమి తీసుకుంటున్నట్లు నోటిఫికేషన్ ఇచ్చారని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతులు పీలా సీతారాం, పీలా బుజ్జి, మురళి తదితరులు ఉన్నారు.

2026 కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం : టిడిపి చోడవరం పట్టణ యువ నాయకులు సకురు కోటేశ్వరరావు ముద్రించిన 2026 సంవత్సర కేలండర్‌ను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ 6000 కేలండర్లను ముదిరించామని, మండలంలో టిడిపి శ్రేణులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

వంగవీటి మోహన్ రంగా వర్ధంతి



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న యువసేన ప్రతినిధులు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పంచాయతీ పరిధి అన్నవరం వీధిలో శుక్రవారం వంగవీటి మోహన్ రంగా 37వ వర్ధంతి కార్యక్రమం స్థానిక యువకులు ఘనంగా నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగా యువసేన నాయకులు పందిరి శ్రీను, ఆకుల రమేష్, నాగులపల్లి వినోద్ కుమార్, వెంకటేష్, శ్యాము, మహేష్ అల్లం రామప్పరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని రైవాడ గ్రామంలో రంగా విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాండ్రాసి సింహాచలం నాయుడు, హరి, రాము, ఈశ్వరరావు, గొర్లె అప్పారావు, వెంకట్ పాల్గొన్నారు

గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు బంటా కాలనీలో గోపాలపట్నం కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా వర్ధంతి నిర్వహించారు. రంగా విగ్రహానికి ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు పూలమాలవేసి నివాళి అర్పించారు కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చినబాబు, కార్యదర్శి కంపర సత్తిబాబు, కార్యవర్గ సభ్యులు మేడిద రాజశేఖర్ పాల్గొన్నారు

వేపగుంట : గోశాల జంక్షన్ వద్ద వంగవీటి రంగా వర్ధంతిలో భీమిలి నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి డాక్టర్ పంచకర్ల సందీప్ పాల్గొని నివాళులర్పించారు. త్వరలోనే రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో విగ్రహ వ్యవస్థాపకులు చలమర శెట్టి వెంకటరమణ. గొల్ల నాగార్జున, దత్తు చిరంజీవి, జయరాజ్ పాల్గొన్నారు


రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. గొంప వారి కల్లాలు, మొండి వీధి (సులబ్ కాంప్లెక్స్ దారి), కాపు వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణాలకు సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు భూమి పూజలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సహకారంతో రూ.6 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు దీవి శంకర్, కొల్లి ఈశ్వరరావు, గుల్లిపల్లి మురళి, అల్లు అబద్ధం, గుల్లిపల్లి అర్జునరావు, దారపు రెడ్డి దేవుళ్ళు, వంజంగి సూర్యనారాయణ, సబ్బవరపు మాలిబాబు పాల్గొన్నారు.


శంకుస్థాపనలో పాల్గొన్న మాజీ ఎంపిపి రాజేశ్వరి తదితరులు

కొరుప్రోలులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-యస్.రాయవరం : ప్రజా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా కొరుప్రోలు గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో పెదగుమ్ములూరుకి చెందిన శ్రీవెంకటేశ్వర పోలిక్లినిక్ వారు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దగ్గు, జలుబు, ఇతర రోగాలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రజలకు పోషకాహార లోపం, శీతాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పి.అనిల్ వర్మ, గ్రామ పెద్దలు కోరా రామారావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అనిల్ వర్మ

డ్రెయినేజీ నీటితో దుర్గంధం

-శుభ్రం చేసుకుంటున్న స్థానికులు -పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి- చీడికాడ:డ్రైనేజీలో నీరు నిలువ ఉండడంతో చెడు వాసన భరించలేకపోతున్నామంటూ వీధివాసులు గగ్గోలు పెడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేయండి మహాప్రభువు అంటూ వాపోతున్నారు. చీడికాడ మండల కేంద్రంలో పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద గల రోడ్డును ఆనుకొని ఉన్న కల్వర్టు మరమ్మత్తు కావడంతో డ్రైనేజీలో నీరు నిలువ ఉండిపోతోంది. దీంతో చెడు వాసన భరించలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేయమని లబోదిబో మొత్తుకున్నా కూడా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. గత్యంతరం లేక స్థానిక నివాస పోతల దేవుడు నాయుడు వెదురు బొంగుతో డ్రైనేజీ మధుము లో నిలువు ఉన్న మురుగునీటిని పంపేందుకు నానా ఇక్కట్లు పడుతున్నట్లు ఆయన వాపోయారు అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీని శుభ్రం చేయాలని స్థానికులు కోరారు.



మురుగునీటి ప్రవాహాన్ని చెత్తను కర్రతో తీస్తున్న స్థానికుడు

పలుచోట్ల సిపిఐ శత వార్షికోత్సవం



విశాఖ ప్రజాప్రదర్శలో పాల్గొన్న నేతలు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని నాగులపల్లి గ్రామంలో సిపిఐ శత వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా సిపిఐ నాయకులు ఎంఆర్ఎస్ ప్రకాశరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మళ్ల మాధవరావు, నాయకులు ఆడారి రామారావు, జగదీశ్వరరావు పాల్గొన్నారు.

చోడవరం రూరల్ : మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో శత వసంతోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సోమదల దేవి, కాకి దేవి, ఇమంద కొండమ్మ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక గుండాల జంక్షన్, వేల్పుల వీధి, గవరపాలెం, విజయరామరాజుపేట తదితర ప్రాంతాల్లో సిపిఐ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరామదాసు తాకాసి వెంకటేశ్వరరావు, వైఎన్. భద్రం, మల్లిబాబు పాల్గొన్నారు.

గొలుగొండ: మండల కేంద్రంలో సిపిఐ 101వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు మేకా సత్యనారాయణ జెండా ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ,అటవీ బంజరు భూములను పేదలకు పంపిణీ చేసి వారికి పట్టాల పంపిణీ చేయించిందన్నారు. భూస్వామ్య విధానాన్ని రద్దు చేయాలని పేద రైతుల పక్షాన నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, డిసిహెచ్ క్రాంతి, మండల కార్యదర్శి జి.రాధాకృష్ణ, నల్లబెల్లి శ్రీరామమూర్తి, కార్యవర్గ సభ్యులు మేకా భాస్కరరావు, లోకారపు అప్పలనాయుడు, మర్రి బాబులు, రాము, దొర, సత్తిబాబు, రాంబాబు, బుజ్జి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సిపిఐ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. 100 సంవత్సరాలకు గుర్తుగా 100 ఎర్రజెండాలతో సరస్వతి పార్కు నుంచి డాబా గార్డెన్స్, ఎల్ఐసి భవనం, ఆర్‌టిసి కాంప్లెక్స్, ఆశీలుమెట్ట మీదగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ఈ ప్రజ ప్రదర్శనలో ఆ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన బహిరంగ సభలో సిపిఐ జాతీయ సభ్యులు జెవి.సత్యనారాయణమూర్తి, రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రాఘవేంద్రరావు, ఎజె.స్టాలిన్ పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక సిపిఐ కార్యాలయంలో పార్టీ శతవార్షికోత్సవం సందర్భంగా జెండాను సిపిఐ కార్యదర్శి కానూరి రాంబాబు. ఎఐటియుసి కొండపు ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం తగరపువలస మెయిన్ రోడ్డు పురవీధులలో ఎర్రజెండాలు పట్టుకొని నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు.కార్యక్రమంలో మోర అప్పలరాజు, ఆదినారాయణ, రామ్, పైడి సూర్యనారాయణ పాల్గొన్నారు

మధురవాడ :. సిపిఐ శత వార్షికోత్సవాలు సందర్భంగా శుక్రవారం మధురవాడ సిపిఐ కార్యాలయం వద్ద పార్టీ సీనియర్ సభ్యురాలు పెంటపల్లి కాంతమ్మ పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, ఏరియా కార్యదర్శి వి సత్యనారాయణ,ఎం ఎస్ పాత్రుడు, ఎం బంగారయ్య, వి అప్పలరాజు, పి రమణ, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఘర్షణ

ప్రజాశక్తి-రావికమతం: రావికమత మండలం కొత్తకోట గ్రామంలో వివాదాస్పద స్థలం పై పరస్పరం దాడిలో ఇరు వర్గాల వారు గాయపడ్డారు. గ్రామంలో 206 గజాలు ఇంటి స్థలంపై అడ్డూరి భూలోక, పల్లం రాజమోహన్ మధ్య గత కొంతకాలంగా నెలకొన్న వివాదం చిలికి చిలికి గాలి వానాలా సాగుతుంది. ఈ స్థలంలో రాజమోహన్ నిర్మాణ పనులు తలపెట్టగా, అడ్డూరి భూలోక వర్గం పనులను అడ్డుకోవడంతో ఇరువర్గాలు దాడి చేసుకున్నట్లు కొత్తకోట ఎస్.ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.



పరీక్షిస్తున్న వైద్యులు

కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గణేష్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పాడేరు మండలం దేవాపురం పంచాయితీ సర్పంచ్ కిల్లో పరమేశ్వరీ ఆధ్వర్యంలో కంగెడ్డ, హనుమంతపురం గ్రామాలలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పెద్ద ఎత్తున వచ్చిన గిరిజనులు, వృద్ధులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కంటి అద్దాలు, దుప్పట్లు, స్థానిక పాఠశాలకు బల్లలు, కుర్చీలు, వాటర్ ఫిల్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నర్సింగ్‌రావు, రాజు, ఆర్ఎస్ఎస్ సేవా భారతి సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారును కలిసిన దేముడు



బండారును సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మాడుగుల:ఇటీవల అనకాపల్లి పార్లమెంట్ కమిటీలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన కింతలి పిఎసిఎస్ అధ్యక్షులు ఉండూరు దేముడు కూటమి నాయకులతో కలిసి మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తిని, అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబుని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదములు తెలిపారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో కూటమి పార్టీ అభివృద్ధి కోసం పార్టీ ఆదేశానుసారం పనిచేస్తానని తెలిపారు. గతంలో సర్పంచ్‌గా, ఎంపిటిసీగా, మండల పార్టీ ప్రధాన కార్యదర్శిగా పిఎసిఎస్ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని పార్టీ పటిష్ఠత కోసం బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే బండారు, టిడిపి బత్తుల తాతయ్య బాబు తెలియజేయడం జరిగిందన్నారు. పొంగలిపాక సర్పంచ్ నాయన సత్యనారాయణ, గ్రామ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు చిట్టి సత్తిబాబు, పోతురాజు, నీటి సంఘం అధ్యక్షుడు బంటు మల్లు నాయుడు, పాల సంఘం అధ్యక్షుడు నాయనా జోగినాయుడు, ఉప సర్పంచ్ కోరుకొండ శ్రీనివాసరావు, పి శివరాంపురం గ్రామ పెద్ద ఎర్ర సత్యం, స్కూల్ కమిటీ అధ్యక్షుడు దంట్ల రవి,,విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మునాసల నాగేశ్వరరావు, అలవల అప్పారావు,వెలుగు వివోఏ పచ్చికొర నాగేశ్వరరావ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి-చింతపల్లి : ఆంధ్ర కాశ్మీర్‌గా పేరుగాంచిన లంబసింగి ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడుతోంది. ఏజెన్సీ ప్రాంతమంతటా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో పొగమంచు కమ్ముకొని, వణికించే చలితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ఈ ప్రత్యేక వాతావరణాన్ని ఆస్వాదించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో లంబసింగికి తరలివస్తున్నారు. తెల్లవారుజామున మంచుతో కప్పబడిన కొండలు, చెట్ల మధ్య ఏర్పడుతున్న పొగమంచు దృశ్యాలు పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. చలి తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ, ఆ సహజ అందాలను కళ్లారా వీక్షించాలనే ఉత్సాహంతో పర్యాటకులు ఉదయాన్నే లంబసింగి పరిసర ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఫొటోలు, సెల్ఫీలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ ఈ ప్రాంత విశేషాలను మరింతగా ప్రచారం చేస్తున్నారు. లంబసింగి, చింతపల్లి ప్రాంతాల్లోని రిసార్టులు, లాడ్జీలు కిటకిటలాడాయి.

అభివృద్ధి పనులకు
రూ3.60 కోట్ల నిధులు మంజూరు

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగుల నియోజకవర్గం లో ఎన్ఆర్ఈజీఎస్ నుంచి వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ 3.60 కోట్లు నిధులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంజూరు చేయించారు. మాడుగుల మండలంలో శంకరం సచివాలయం నుండి మామిడిపాలెం వరకు 0.5 కిలోమీటర్లకు 50 లక్షలు, దొర్లగొట్టివాడ రాజంపేట మీదగా రాయిపాలెం 0.83.కిలోమీటర్లుకు 50 లక్షలు, జాలంపల్లి పంచాయతీ పెద్ద కుల్తిమాంబ తల్లి ఆలయం నుండి పాతూరు వరకు 1.2 కిలోమీటర్లుకు 50 లక్షలు, మడవీడు జంక్షన్ నుండి చిన్న పెట్టగెడ్డ 2 కిలోమీటర్లు ఆర్ అండ్ బి రోడ్డుకు 30 లక్షలు, గుడివాడ బిటీ రోడ్డు నుండి మల్లిపాడు 0.6కిలోమీటర్లుకు 50 లక్షలు, అలాగే చీడికాడ మండలం వీరభద్ర పేట పంచాయితీ కొండంపూడి బీటీ రోడ్ నుండి ముడిచేరి గ్రామం వరకు0.35 కిలోమీటర్లు 50 లక్షలు, దేవరాపల్లి మండలం వాలాబు బొద్దుగుమ్మి నుండి నగరపాలెం గ్రామం వరకు 1.3 కిలోమీటర్లు 30 లక్షలు మొత్తం 8 పనులకు ఈ నిధులు మంజూరు చేసినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన


ప్రజాశక్తి- రావికమతం:మండలంలోని కొత్తకోట గుమ్మడి గోవిందు ఇంటి వద్ద నుండి గుమ్మడి సంతోష్ ఇంటి వరకు డ్రెయినేజీ నిర్మాణానికి శుక్రవారం ఎంపీటీసీ కుంచా లక్ష్మి శంకర్‌రావు, సర్పంచ్ కోన లోవరాజు భూమి పూజ చేశారు. నాలుగు లక్షల రూపాయలు మండల పరిషత్ జనరల్ ఫండ్ నిధులతో డ్రెయినేజీ నిర్మాణం పనులు చేపట్టడం జరుగుతుందని ఎంపిటిసి కుంచ లక్ష్మి శంకర్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో డ్రెయినేజీ సదుపాయం లేక ఈ ప్రాంత వాసులందరూ ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. దీని నిర్మాణంతో ఇబ్బందులు నుంచి బయటపడినట్లేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్మడి సత్యదేవ, ప్రోటోకాల్ జెడ్పిటిసి తలారి ఆదిమూర్తి, మండల వైఎస్ఆర్సిపి కార్యదర్శి శీలం శంకర్రావు, గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, మూడవ సెగ్మెంట్ ఎంపీటీసీ పైల చిన్నమ్మలు పాల్గొన్నారు.



ఊరేగిస్తున్న పురోహితులు

గజ వాహనంపై వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీనివాసుడు గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి ,భూదేవి సమేత వెంకన్న ఉత్సవమూర్తులను గజ వాహనం , గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకిలోను అధిష్టింప చేసి మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, పవన్,వలువురు భక్తులు పాల్గొన్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న పిఎసిఎస్ చైర్మన్ దొండా నరేష్

వాణిజ్య బ్యాంకుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది పిఎసిఎస్‌ను వాణిజ్య బ్యాంకుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చైర్మన్ దొండా నరేష్ తెలిపారు. శుక్రవారం పిఎసిఎస్‌లో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం సొసైటీ టర్నోవర్ రూ.10కోట్లు ఉందని, క్రాప్ లోన్లు రూ.6 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.2.5కోట్లు, గోల్డ్ లోన్లు రూ.1.5 కోట్లు ఉన్నాయని తెలిపారు. 1219 మంది సభ్య రైతులు రుణాలు తీసుకున్నారన్నారు. ఏడాదిలోపు చెల్లించిన రుణాలకే వడ్డీ రాయితీ వస్తుందన్నారు. ప్రస్తుతం వడ్డీ రాయితీ 3 శాతం వస్తుందని, దీనిని గతంలో మాదిరిగా 4శాతానికి పెంచాలని రైతులు కోరుతున్నారని తెలిపారు. రబీ సీజన్‌లో సొసైటీలో రైతులకు యూరియా అమ్మకాలు చేస్తామన్నారు. సొసైటీలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, ఇప్పటివరకు 320 టన్నులు కొనుగోలు చేశామని చెప్పారు. సొసైటీని డిజిటలైజ్ చేయించి ఎస్‌బి, ఆర్డి డిపాజిట్లు సేకరిస్తామని తెలిపారు. ప్రస్తుతం గోల్డ్ రుణాలపై 7.95శాతం వడ్డీ వసూలు చేస్తున్నామని, 10 నిమిషాల్లోనే గోల్డ్ రుణాలు ఇస్తామని చెప్పారు. ఇటీవల మృతి చెందిన సభ్య రైతు పైల అప్పలనాయుడు కుటుంబానికి మంజూరైన రూ.30వేల బీమా పరిహారాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దొండ సాయి, సీఈఓ ఎం.శాంతి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలు

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని దార్లపూడి, చిన గుమ్ములూరు, తిమ్మాపురం, గెడ్డపాలెం గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నులు శుక్రవారం వసూలు చేసినట్లు డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ తెలిపారు. ఆన్లైన్ ప్రక్రియ ద్వారానే ఇంటి పన్నులు వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ నెల చివరి తేదీ నాటికి ఇంటి పన్నులు వసూలు లక్ష్యాలను పూర్తి చేసేందుకు ప్రతీ పంచాయతీలో ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి మండలంలోని కొక్కిరపల్లి పిఎసిఎస్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించరు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక క్వింటా ఖరీదు రూ.2369 కాగా, 75 కేజీలు బస్తాను రూ.1777 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. ధాన్యం ఇచ్చిన 24 నుంచి 48 గంటల వ్యవధిలో రైతుల ఖాతాలో నగదు జమ అవుతాయని చెప్పారు. అనంతరం రామారాయుడుపాలెం గ్రామం నుంచి ఏఎంసి వైస్ చైర్మన్ బాబురావు గొర్లె బాబురావు యొక్క ధాన్యాన్ని జెండా ఊపి వెహికల్‌ని ప్రారంభించారు. అలాగే రాంబిల్లి మండలం దిమిలిలో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహన్ రావు, పిఎసిఎస్ చైర్మన్‌లు మొటూరు గోపీనాథ్, శంకర్, యలమంచిలి ఎంపీపీ రాజన శేషు, మార్కెట్ కమిటీ చైర్మన్ లోవ కుమారి, బొద్దపు శ్రీనివాసరావు, గొర్లి నానాజీ, రమేష్ నాయుడు, జై రామ్, ఐ సన్యాసినాయుడు, రమేష్ వ్యవసాయ శాఖ సిబ్బంది, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ఉత్సాహంగా సిఐటియు మహాసభ ప్రచారం

సిఐటియు అఖిల భారత మహాసభ ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ విశాఖలో జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రచారం ఉత్సాహంగా సాగింది. పలు చోట్ల బైకు ర్యాలీలు చేపట్టారు. పోస్టర్లను ఆవిష్కరించారు.

ప్రజాశక్తి-మాడుగుల: అఖిలభారత సిఐటీయు 18వ మహాసభలు ఈనెల 31 నుంచి విశాఖపట్నంలో జరుగుతున్న సందర్భంగా వాటిని జయప్రదం చేయాలనీ మాడుగులలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ, చారిత్రాత్మక అఖిల భారత మహాసభలో యావన్మంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మికుల సమస్యలపై అకుంఠిత దీక్షతో పోరాడుతున్న సిఐటియు మహాసభలు ఈ ప్రాంతంలో జరగడం ఈ ప్రాంత పోరాటాలకే వెన్నుదన్నుగా నిలుస్తాయని అన్నారు. అనకాపల్లి జిల్లాలో కార్మిక హక్కులకై, ఉద్యోగ భద్రతకై సిఐటియు పోరాడుతుందన్నారు. స్కీం వర్కర్ల సమస్యలు, కనీస వేతనాల అమలకై అసంఘటితరంగ కార్మికులకు సిఐటియు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. జనవరి 4న విశాఖపట్నంలో లక్షలాది మందితో జరిగే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్లి భవాని, ఇ.నరసింహమూర్తి, బత్తుల గంగాభవాని, గొల్లూరి జగదీశ్వరీ, సుంకరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాడుగులలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు, పాల్గొన్న కార్మికులు

పలు చోట్ల బైక్ యాత్రలు

పరవాడ : సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను, జనవరి 4న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం బైక్ యాత్ర నిర్వహించారు. పరవాడ మండలంలోని ఫార్మసిటీలో నిర్వహించిన బైక్ ర్యాలీలో సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భవించి 55 సంవత్సరాల కాలంలో మొదటిసారి ఆంధ్రప్రదేశ్లో విశాఖపట్నం మహాసభలకు వేదిక కానుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్రి పోతినాయుడు, కె.వెంకట్రావు, కె.వెంకునాయుడు, ఏ.రాజు, దూల దేవుడు, వి.కన్నబాబు పాల్గొన్నారు

యలమంచిలి టౌన్ : జనవరి 4న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన అచ్యుతాపురం ఎస్ఇజెడ్ రోడ్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా కార్యదర్శి ఆర్ రాము, మండల కార్యదర్శి కే సోము నాయుడు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని, బయటికి మేడిపండులా ఉన్న ఈ చట్టం లోపల కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజాన సత్తిబాబు, కార్మికులు పాల్గొన్నారు.

శ్రామిక ఉత్సవ్ ఆటో ప్రచారజాతా ప్రారంభం

ములగాడ : సిఐటియు 18వ అఖిలభారత మహాసభ సందర్భంగా యూనియన్ మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో 60వ వార్డు శ్రీహరిపురం వాకింగ్ పార్కు వద్ద శుక్రవారం ఆటో ప్రచారాన్ని మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణమూర్తి ప్రారంభించారు. ఈ నెల 27 నుంచి నుంచి శ్రామిక్ ఉత్సవాల్లో పాల్గొని జయప్రదంచేయాలని కోరారు కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు కె. పెంటారావు, ఎ.సత్యారావు, రమణ గంగాధర్, ఎస్‌కెసుభాని, పెన్షనర్ నాయకులు పి తాతాజీ, ఆర్ దేవరాజు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.



మల్కాపురంలో...

నగరంలో బైకు ర్యాలీ

ఎంవిపి.కాలనీ : సిఐటియు 18వ అఖిల భారత మహాసభను విజయవంతం చేయాలంటూ ఆ సంఘం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రజాశక్తి జనరల్ మేనేజర్ కె.హరికిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ మద్దిలపాలెం నుంచి ప్రారంభమై సత్యం జంక్షన్, సీతమ్మధార, హెచ్‌బి.కాలనీ, వెంకోజీపాలెం, ఎంవిపి.కాలనీ, వాల్తేరు మీదుగా సిరిపురం నుంచి మద్దిలపాలెంనకు చేరుకుంది. జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ విశాఖలో జరిగే మహాసభకు వివిధ రాష్ట్రాల నుండి 1500 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. ర్యాలీలో వి.కృష్ణారావు, వి.నరేంద్ర కుమార్, కె.కుమారి, శంకర్, శ్రీను, నాయుడు, ఆదినారాయణ, రాజు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో బైక్ ర్యాలీ చేపడుతున్న నేతలు

పాడేరు:- విశాఖలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహిస్తున్న సిఐటియు అఖిల భారత 18వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణ వీధుల్లో శుక్రవారం వివిధ రంగాల కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ముఠా కార్మిక వర్గాలు కదిలి వచ్చి సిఐటియు జిందాబాద్ నినాదాలతో ఈ ర్యాలీని చేపట్టారు. జనవరి 4న చలో విశాఖ కార్యక్రమంతో కదిలి రావాలని నినదించారు. డిసెంబరు 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జరుగుతున్న సందర్భగా జనవరి 4న వేలాది మందితో జరిగే భారీ ర్యాలీ లో కార్మిక వర్గాలన్నీ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు ఏలూరి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ ర్యాలీలో భాగంగా పాడేరు ఆర్టీసీ డిపో వద్ద సిఐటియు జెండాను కార్మికులతో కలసి జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందర్రావు ఆవిష్కరించారు. అనంతరం కాంప్లెక్స్ నుండి ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కార్పొరేట్లకు ధనవంతులకు మేలు చేసే విధంగా కేంద్రంలో ఉన్న బిజెపి కార్మికుల అణిచి వేసేందుకు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దు చేసి కార్మికుల నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు. తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జనవరి 4న జరిగే భారీ బహిరంగ సభ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పాడేరు మండల కన్వీనర్ ప్రసాద్, ముఠా కలసిల యూనియన్ నాయకులు రాజు, సూరిబాబు, అప్పలనాయుడు, శంకర్, దాసు పాల్గొన్నారు.



విశాఖ నగరంలో బైక్ ర్యాలీ

అరకులోయ రూరల్: సిఐటియు అఖిలభారత మహాసభను విజయవంతం చేయాలని, జనవరి 4న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభకు వేలాది మంది కార్మికులు హాజరై మహాసభను విజయవంతం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. అరకులోయ మండల కేంద్రంలో శుక్రవారం సిఐటియు జిల్లా కోశాధికారి పోతురాజు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ కి ముఖ్య అతిథిగా కిల్లో సురేంద్ర పాల్గొని మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల జీతాలను పెంచకపోవడం, జీవితాంతం పనిచేసే కార్మికులను తక్కువ వేతనంతో కొనసాగించడం, పర్మినెంట్ చేయక పోవడం దారుణమన్నారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జె. భగత్ రాం, సిపిఎం మండల కార్యదర్శి కే.రామారావు, కిల్లో జగనాదం, బి.ధశరథ్ పాల్గొన్నారు.

కొయ్యూరు: జనవరి 4వ తేదీన జరుగు సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు మండల నాయకుడు సూరిబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో కరపత్రాలు పంచారు. అనంతరం మాట్లాడుతూ ఐక్య పోరాటం నినాదంతో అన్ని సమరశీల పోరాటాల్లో సిఐటియు అగ్రభాగాన ఉందన్నారు. కార్మిక కర్షక ఐక్యతతో పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చి కార్మిక రాజ్యాంగాన్ని స్థాపించడం సిఐటియు లక్ష్యమని పిలుపునిచ్చారు.జనవరి 4న జరిగే భారీ బహిరంగ సభ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



పరవాడలో...